



అకాల వర్షానికి నేలరాలిన మామిడి కాయలు

వైసిపిలో సంస్థాగత మార్పులు..!

◆ కొన్ని స్థానాల్లో సమన్వయకర్తలను మార్చే యోచన

◆ ఇప్పటికే శింగనమలకు శైలజానాథ్

◆ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మార్పులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో ఘోరమైన ఓటమిని చవిచూసిన తరువాత వైసిపి పార్టీలో కొన్ని మార్పులు చేపట్టేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోంది. ఇప్పటికే అనుబంధ సంఘాల్లో మార్పులు చేస్తూ కొత్త కమిటీల ఏర్పాటు చేపడుతోంది. అదే సమయంలో కొన్ని చోట్ల నియోజకవర్గ సమన్వయకర్తల మార్పులు కూడా చేపట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికే శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త మార్పు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన వీరాంజినేయులు రాజకీయాలకు దూరంగా ఉండి సొంతపనులు చేసుకుంటున్నారు. ఇక ఆ నియోజకవర్గంపై పట్టున్న ఆలూరు సాంబశివారెడ్డి ని కాదని కాంగ్రెస్ పార్టీ నుంచి ఇటీవల వైసిపిలో చేరిన మాజీ మంత్రి సాకే శైలజనాథ్‌ను శింగనమల నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఇదే తరహాలో కొన్ని నియోజకవర్గాల్లో మార్పులు చేపట్టే ఆలోచనలోన్నుట్టు తెలుస్తోంది. కదిరి, రాయదుర్గం, మడకశిర, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఇది వరకున్న సమన్వయకర్తలు ఇప్పుడు యాక్టివ్‌గా లేరు. స్థానిక నాయకులే ఎవరూ లేకున్నా కార్యక్రమాలు చేసుకుని పోతున్నారు. ఇక పార్లమెంటుకు పోటీచేసిన వారిలోనూ శంకర నారాయణ అనంతపురానికి పోటీ చేశారు. ఆయన సత్యసాయి జిల్లా వైపే మొగ్గుచూపుతున్నారు. గతంలో ఆయన సిట్టింగ్ స్థానమైన పెనుకొండ వైపు మొగ్గు చూపుతున్నారు. అక్కడ ఇప్పుడు సమన్వయకర్తగా ఉన్న ఉషశ్రీచరణ్‌కు శంకర నారాయణకు మధ్య విభేదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శంకర నారాయణను హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్తగా మార్చే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అక్కడ పార్లమెంట్‌కు పోటీ చేసిన శాంతమ్మ ఎన్నికల తరువాత నుంచి పూర్తిగా కనుమరుగయ్యారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఆమె బళ్లారి నుంచి వచ్చి పోటీ చేశారు. ఆమె ఓటమి తర్వాత తిరిగి బళ్లారికే పరిమితమయ్యారు. దీంతో శంకర నారాయణను పార్లమెంట్ సమన్వయకర్తగా నియమించడం ద్వారా ఈ లోటును భర్తీ చేసే ఆలోచన నడుస్తున్నట్టు తెలుస్తోంది. ఇక అనంతపురానికి మరో నాయకుడిని నియమించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక నియోజకవర్గాల్లో చూస్తే రాయదుర్గం సమన్వయకర్త మెట్టుగోవిందరెడ్డి యాక్టివ్‌గా లేరు. పైగా ఒక గ్రూపు ఆయన్ను వ్యతిరేకిస్తోంది. అక్కడ కొత్త వారికి తీసుకొస్తే బాగుంటుందని జిల్లా నేతలు భావిస్తున్నట్టు సమాచారం. కదిరి మక్బుల్ బాషా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవలే ఆ పార్టీలోని తక్కిన నేతలు సమావేశమై ఎవరో ఒకరిని నియమించాలని కోరినట్టు తెలుస్తోంది. పుట్టపర్తికి మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కూడా నియోజకవర్గ కార్యక్రమాల్లో కనిపించడం లేదు. మడకశిర పరిస్థితి అదే రకంగా ఉంది. ఎన్నికల్లో పోటీ చేసిన ఈరలక్కప్ప పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గాలేరు. ఈ నేపథ్యంలో ఇక్కడ కొత్త వారిని తీసుకొచ్చే ఆలోచనలో వైసిపి అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది. రాబోయేది స్థానిక సంస్థల ఎన్నికల సమయం కాబట్టి అంతలోపు కొత్త నాయకత్వాన్ని దింపి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ఆలోచన వైసిపి అధష్టానం చేస్తున్నట్టు తెలుస్తోంది.



గాలివాన బీభత్సం

నేలకొరిగిన అరటి చెట్లు - రాలిన మామిడి కాయలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన గాలివానకు ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో వర్షపాతం 365 మిల్లీమీటర్లు నమోదయింది. వర్షం కన్నా విపరీతమైన ఈదురు గాలుల వల్ల ఎక్కువ నష్టం జరిగింది. జిల్లాలో బుక్కపట్నం, నల్లమాడ, ధర్మవరం, కదిరి మండలాల్లో సుమారు 1000 ఎకరాల్లో మామిడి పంట నష్టం జరిగింది. పంట చేతికి వచ్చే సమయానికి ఈదురు గాలులకు మామిడికాయలు నేలరాలాయి. జిల్లాలో సుమారు 22 ఎకరాల్లో అరటి చెట్లు నేలకు ఒరిగినట్లు ఉద్యానవన శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్ శనివారం తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నట్లు ఆయన తెలిపారు. అరటి చెట్లు నేలకొరగడం, మామిడికాయలు నేలపాలు కావడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో పలుచోట్ల విద్యుత్ అంతరాయం కలిగింది. శుక్రవారం రాత్రి అంతా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బుక్కపట్నం : శుక్రవారం రాత్రి కురిసిన వర్షం, వీచిన ఈదురుగాలుకు మండల పరిధిలో దాదాపు 400 ఎకరాల్లో మామిడి పంట నేల రాలింది. భారీగా గాలులు వీచి, చెట్లు నుంచి మామిడికాయలు పూర్తిగా నేల రాలిపోయాయి. నేలి రాలిన మామిడి తోటలను మండల ఉద్యానవన రైతులు పరిశీలించారు. ఈశ్వరప్ప అనే రైతు మాట్లాడుతూ పంట దిగుబడి తక్కువగా ఉన్న సమయంలో ఉన్న కొద్దిపాటి మామిడి కాయలు కూడా ఈదురుగాలులకు రాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశాడు.

5న ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ కళాశాలలో ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-హిందూపురం

టాటా ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తయారీ విభాగం(హోసూరు), జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా ఉద్యోగ మేళాను ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు మహిళా అభ్యర్థులకు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.18 వేల జీతంతో పాటు ఉచిత వసతి, భోజనం, రవాణా సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ఉద్యోగాలకు ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలతో,18-26 సంవత్సరాల మధ్య వయసు మహిళలు అర్హులన్నారు. ఆసక్తిగల వారు తమ బయోడేటాతో పాటు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, జిరాక్స్ కాపీలు, రెండు పాస్ ఫోటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు నియామక అధికారి డాక్టర్ బి.రవి నాయక్ ఫోన్ నెంబర్ 9493757277ను సంప్రదించాలని ఆమె వివరించారు.



రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

బత్తలపల్లి-ప్రజాశక్తి

అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన రైతు కురుబ పెద్ద మల్లేష్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. మండలంలోని కోడేకండ్ల గ్రామానికి చెందిన రైతు కురుబ పెద్దమల్లేష్ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలుసుకున్న ఎపి రైతు సంఘం నాయకులు శనివారం ఆ గ్రామం వెళ్లి రైతు కుటుంబాన్ని పరామర్శించారు. పెద్దన్న మాట్లాడుతూ రైతు పెద్దమల్లేష్ పంటల సాగు కోసం బోర్లు వేసినా నీరు పడకపోవడం, అతివృష్టి, అనావృష్టి, తదితర కారణాలతో పంటలు పండక పోవడం, ఇతరుల భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసినా నష్టాలు వచ్చాయన్నారు. ఈ క్రమంలో దాదాపు రూ. 30 లక్షల వరకూ అప్పులు చేశాడన్నారు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడం, అప్పులు తీర్చే మార్గం లేకపోవడం, ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ట్రాక్టర్ తీసుకెళ్లడం అవమానం భరించలేక రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఓ రకంగా రైతు ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటు ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మారుతి, వీరనారప్ప, తదితరులు ఉన్నారు.

గిరిజన పాఠశాలల్లో సీట్ల భర్తీకి చర్యలు


ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఉన్న గిరిజన పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి 3, 4, 5, 6, 7, 8, 9వ తరగతులకు సంబంధించి మిగిలిన సీట్లను ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాగులపాడు, గిరిజన గురుకుల బాలుర పాఠశాల, గోరంట్ల గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కదిరి గిరిజన గురుకుల బాలుర, బాలికల పాఠశాల, పెనుకొండ గిరిజన గురుకుల బాలికల పాఠశాల్లో సీట్లు అదుబాటులో ఉన్నాయన్నారు. ఈ పాఠశాలల్లో సీట్లు కావాల్సిన గిరిజన బాల, బాలికలు సంబంధిత పాఠశాలల్లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తులు అందించాలన్నారు. ఉన్న సీట్లే కంటే అదనంగా ధరఖాస్తులు వస్తే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల గిరిజన సంక్షేమ అధికారుల ఆధ్వర్యంలో 30వ తేదీన అనంతపురం నవోదయ కాలనీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో లాటరీ తీస్తామన్నారు.

బాల బాలికల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

బల బాలికల సంరక్షణ బాధ్యత సంఘాన్ని ప్రభావితం చేసే వ్యక్తులదేనని చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు కొండయ్య పేర్కొన్నారు. సామాజిక నిబంధనలు, హానికరమైన పద్ధతులను మార్చడానికి మత పెద్దలు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై శనివారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్యఅతిథులుగా జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సమాజంలో పిల్లలకు ఎలాంటి హాని తలపెట్టే పనులు చేయకూడదన్నారు. లైంగిక వేధింపుల నుంచి పిల్లలను రక్షించడానికి నివేదించబడిన కేసులపై పెద్దలు, కుటుంబాలు, సంఘాలు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను మొబైల్ నుంచి దూరంగా ఎలా ఉంచాలో సూచించారు. పిల్లలు మొబైల్ వినియోగించేటప్పుడు తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. ఎవరి నుంచైనా పిల్లలకు ఆపద పొంచి ఉందని తల్లిదండ్రులు గ్రహిస్తే 1930కి ఫోన్ చేయాలన్నారు. అలాగే బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు అరుణ్‌కుమార్, జోసఫ్, విశ్వాస్, ఫిలిప్, ఐసిపిఎస్ సోసియల్ వర్కర్ ఆనంద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలల హక్కుల సంరక్షణ సమితి సభ్యులు కొండయ్య

ఆర్‌డిటికి అండగా నిలుద్దాం : యుటిఎఫ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఉమ్మడి అనంతపురంజిల్లాలో విద్య, వైద్యం, క్రీడా, గృహ నిర్మాణం, వ్యవసాయ రంగంతో పాటు అనేక రంగాల్లో స్వచ్ఛంధంగా సేవలు అందిస్తూ సమాజానికి అండగా ఉన్న ఆర్‌డిటి సంస్థకు అందరూ అండగా నిలబడాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌డిటి కుల, మత, రాజకీయ రంగాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఉచిత విద్యకు తోడ్పాటునందిస్తూ ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడంలో, కరోనా వంటి విపత్కర సమయంలో మెరుగైన వైద్య సేవలందించి అనేక మంది ప్రాణాలు కాపాడిందన్నారు. వివిధ క్రీడల్లో జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసిందన్నారు. చెక్ డ్యాంలు నిర్మించి, సేంద్రియ ఎరువులను వాడడంలో రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఇలాంటి సంస్థకు కేంద్రం విదేశీ నిధులను ఆపడం తగదన్నారు. వెంటనే పాలక పక్షాలు జోక్యం చేసుకొని ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆర్.రామకృష్ణనాయక్, జోన్ నాయకులు ఎ.లక్ష్మయ్య, పి.సురేష్, ఎం.రామ్‌ప్రసాద్, హెచ్. రామాంజనే యులు, ఎం.వెంకటకిషోర్, బి.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి

నేడు బాలయ్యకు పౌరసన్మానం

హిందూపురంలో ట్రాఫిక్ మళ్లింపు : డీఎస్పీ కెవి మహేష్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకష్ణ ఇటీవల పద్మ విభూషణ్ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నాడు బాలకృష్ణకు పౌర సన్మానం నిర్వహించనున్నారు. మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే పౌర సన్మానానికి వివిధ ప్రాంతాల నుంచి బాలకృష్ణ అభిమానులు, టిడిపి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులకూ గురికాకుండా ఆదివారం పట్టణంలో ట్రాఫిక్ ను మళ్లిస్తున్నట్లు హిందూపురం డీఎస్పీ కెవి.మహేష్ శనివారం తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపుకు సంబంధించి డీఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సభా ప్రాంగణం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సభకు చిలమత్తూరు, లేపాక్షి, తూముకుంట వైపు నుంచి వచ్చే బస్సులు రహమత్ పురం సర్కిల్ నుండి సభకు వచ్చే వారిని దించి వారి బస్సులను టూ టౌన్ పోలీస్ స్టేషన్ దాటిన తర్వాత ఎడమవైపు, కుడివైపు కేటాయించిన పార్కింగ్ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. అదే విధంగా అనంతపురం నుంచి, గోరంట్ల వైపు నుంచి వచ్చే బస్సులు పట్టణంలోని ఎఆర్ హాస్పిటల్ వద్ద వారిని దించి బస్సులను క్రిస్టియన్ శ్మశాన వాటిక ఎదురుగా ఉన్న పాలిటెక్నిక్ కాలేజీ స్థలంలో, ఎగ్జిబిషన్ గ్రౌండ్ పార్కింగ్ స్థలంలో బస్సులు పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. సభకు విచ్చేసే ఫోర్ వీలర్ వాహనాలు పోలీస్ పెట్రోల్ బంక్ వద్ద మలుపు తీసుకుని రూరల్ స్టేషన్ ముందుగా వెళ్లి పక్కన ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో పార్క్ చేసుకోవాలని కోరారు. ద్విచక్ర వాహనాలలో సభకు హాజరయ్యే వ్యక్తులు తమ ద్విచక్ర వాహనాలు పోలీసు పెట్రోల్ బంక్ వద్ద మలుపు తీసుకుని ఎంజీఎం స్కూలు కాంపౌండ్ లోపలికి వెళ్లి పార్కు చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నుంచి రాత్రి 10 గంటల వరకు బిఎస్‌టి పెట్రోల్ బంక్ నుంచి రహమత్ పురం వరకు సభకు సంబంధించిన వాహనాలు తప్ప వేరే వాహనాలకు అనుమతి లేదన్నారు. బెంగుళూరు వెళ్లే వాహనాలు బిఎస్‌టి సర్కిల్ నుంచి పరిగి బస్టాండ్ మీదుగా బెంగళూరు రోడ్, చిన్న మార్కెట్ వైపుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. చిలమత్తూరు, లేపాక్షి నుంచి హిందూపురం పట్టణానికి వచ్చే వాహనాలు రహమత్ పురానికి సర్కిల్ నుంచి రైల్వే రోడ్డు మీదుగా పాత ఎన్టీఆర్ సర్కిల్, బిఎస్‌టి సర్కిల్ మీదుగా వెళ్లాలన్నారు. బెంగుళూరు, ఆటో నగర్ నుంచి హిందూపురం పట్టణంలోకి వచ్చే వాహనాలు వాల్మీకి సర్కిల్ మీదుగా చిన్న మార్కెట్, ఎంఎఫ్ సర్కిల్, చర్చి రోడ్ మీదుగా వెళ్లాలన్నారు. బిఎస్‌టి సర్కిల్ నుంచి రహమత్ పురం సర్కిల్ వరకు మధ్యలో ఉన్న బాలాజీ సర్కిల్ క్రాస్ నుంచి బైపాస్ లోకి, రైల్వే రోడ్డు నుంచి బైపాస్ రోడ్ లోకి మున్సిపల్ ఆఫీస్ పక్కన వాహనాలకు అనుమతి లేదన్నారు. ప్రజలు ఆయా సూచనలు పాటించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా సహకరించాలని డీఎస్పీ కోరారు.



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్

హిందూపురం అభివృద్ధికి కృషి చేస్తాం

◆ రాష్ట్ర మంత్రి టిజి భరత్ ◆ 2.50 కిలోల వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి బంగారు విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. హిందూపురంలో శనివారం నిర్వహించిన 85వ వాసవి మాత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులతో కలిసి ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో 2.50 కిలోల బంగారంతో తయారుచేసిన వాసవి కన్యకా పరమేశ్వరి మాతా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా నందమూరి బాలకష్ణ ఉండటం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదష్టమన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివద్ధి చేసేందుకు ఆయన ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. లేపాక్షికి సంబంధించిన భూముల సమస్య తీర్చి ఇక్కడకు భారీగా పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు అయితే యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీనేనని మంత్రి తెలిపారు. సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందువరుసలోనే ఉంటారన్నారు. అనంతరం వాసవీమాత బంగారు విగ్రహం తయారుచేసేందుకు సహకరించిన దాతలను ఆయన సన్మానించారు. పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, ఆర్యవైశ్య మహిళా మండలి రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పారపు రజని, ఆర్యవైశ్య సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జెపికె.రాము, ఆర్యవైశ్య మహాసభ గౌరవ సలహాదారుడు పోతుల సురేష్, ఆర్యవైశ్య నాయకులు రామ్ కుమార్, సిరిగుప్ప వెంకటేష్, నరసింహులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని అభినందిస్తున్న మంత్రి

నిధులపై ఎంపిటిసిల నిలదీత

ప్రజాశక్తి-హిందూపురం

"ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశం జరుగుతోంది. ఇందులో ఏ ఒక్క రోజు కూడా మండల గ్రాంట్ ఎంత వచ్చింది.. ఎంత ఖర్చు చేశారు.. అన్న వివరాలు అధికారులు ఎందుకు వెల్లడించడం లేదు' అంటూ వైసిపి ఎంపీటీసీ ధనుంజయ రెడ్డి అధికారులను నిలదీశారు. హిందూపురం మండల పరిషత్ అధ్యక్షురాలు రత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో వైస్ ఎంపీపీ రఘునాథ్ రెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణం, మండలం పరిషత్ అధికారిణి సరస్వతి పాల్గొన్నారు. సమావేశం ప్రారంభించగానే వైసిపి ఎంపీటీసీ ధనుంజయ రెడ్డి తో పాటు మరి కొంత మంది ఎంపీటీసీలు నిధులపై చర్చకు పట్టుబట్టారు. ప్రతి సమావేశంలోనూ వివిధ పనులకు ఆమోదం తెలపడం వరకే ప్రజాప్రతినిధుల బాధ్యత అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. మండలంలో నిధులు ఏమి ఉన్నాయి.. ఆ నిధులు ఎన్ని ఖర్చు చేసినారు తదితర వివరాలు ఏవీ వెల్లడించడం లేదన్నారు. నిధుల విషయం వెల్లడించిన అనంతరమే సమావేశం కొనసాగించాలని పట్టుబట్టారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ సరస్వతి సమగ్ర వివరాలను అందిస్తామని తెలిపారు. దీంతో ఎంపిటిసి శాంతించారు. అనంతరం మండల స్థాయి అధికారులు వారి శాఖల తరపున ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు, అభివద్ధి గురించి వివరించారు. మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీలలో తీవ్ర నీటి ఎద్దడి ఉన్నా సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు మాటమాత్రం కూడా చర్చించలేదు. కేవలం అధికారులు చెప్పారు... ప్రజా ప్రతినిధులు విన్నారు.... అన్నట్లు సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, గహ నిర్మాణ శాఖ ఏఈ నారాయణరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సరస్వతి

నాగిరెడ్డికి డాక్టర్ ఎన్టీఆర్ జాతీయ కీర్తి పురస్కారం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని స్పెంట్ స్వచ్ఛంద సంస్థ నిర్వహకులు నాగిరెడ్డికి డాక్టర్ ఎన్టీఆర్ జాతీయ కీర్తి పురష్కారం వరించింది. శనివారం విజయవాడలోని హోటల్ ఐలాపురంలో డాక్టర్ ఎన్టీఆర్ కీర్తి పురస్కారాలు జాతీయ సాంస్కతిక పురస్కారోత్సవం, డాక్టర్ ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు సందర్భంగా డాక్టర్ ఎన్టీఆర్ కీర్తి పురస్కారాలను పాన్ ఇండియా, ఫిలంత్రోఫిక్ సొసైటీ సౌజాన్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిని మాజీ డిప్యూటీ స్పీకర్, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్‌తో పాటు ముఖ్య అథితుల చేతుల మీదుగా డాక్టర్ ఎన్టీఆర్ జాతీయ కీర్తి పురస్కారాన్ని అందించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుత తన స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టానన్నారు. వాటిని గుర్తించి తనకు సన్మానించడం చాల సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి రాజా, డూండీ రాకేష్, చప్పిడి రాజశేఖర్, కత్తి మండప్రతాప్, నర్సిపల్లి హారిక, కొల్లి రమావతి, రాజశేఖర్, శ్రీనివాసరావు, ప్రసాద్, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.



.సన్మానం అందుకుంటున్న నాగిరెడ్డి

ఆపన్న హస్తానికే ఆపద..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఎవరికి కష్టమెచ్చినా ముందుగా చూసేది ఆర్డీటీ సంస్థ వైపే. ఏదైనా అక్కడి నుంచి సహాయమందుతుందన్న నమ్మకం అంతగా సామాన్యుల్లో ఉండేది. ఆ సంస్థ కూడా 1969వ సంవత్సరం నుంచి ప్రజల్లో పని చేస్తూ వస్తోంది. నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాలో ఎంతోకొంత తోడ్పాటు, సహకారాన్ని సామాన్యులకు అందిస్తూ వస్తోంది. కరువు నుంచి సామాన్యులను గట్టెక్కించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో వాటర్‌షెడ్ల నిర్మాణంతో మొదలైన ఆ సంస్థ అనేక రంగాల్లో సేవలందిస్తూ వచ్చింది. మహిళా సాధికారత, విద్య, వైద్యం, ఆటలు ఇలా వివిధ రంగాల్లో సేవలందిస్తూ రావడంతో ఈ జిల్లావాసులతో ఆ సంస్థ అనుబంధం అంతగా ఏర్పడింది. ఈ సుదీర్ఘ కాలంలోనూ ఎక్కడా ఎటువంటి వివాదాల్లోకి సైతం పడకుండా అతి జాగ్రత్తగా స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తూ వచ్చారు. అందుకే ఆ సంస్థ అంటే సామాన్యులు, పేదల్లో అంతటి నమ్మకమం ఏర్పడింది. అటువంటి సంస్థపై కేంద్ర ప్రభుత్వం కత్తికట్టినట్టుగా వ్యవహరిస్తోందన్ని విమర్శలు వస్తున్నాయి. గతేడాదే ఈ సంస్థకు వచ్చే విరాళాలపై వేటు వేసింది. ఇప్పుడు ఏకంగా సంస్థపైనే వేటుకు సిద్ధపడినట్టు కనిపిస్తోంది. ఈ వారంలో ఆ అంశం జిల్లాలో అందరినీ ఒకింత ఆందోళనకు గురిచేస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ఏకంగా సేవ్ ఆర్డీటీ పేరుతో ఉద్యమాన్ని ప్రారంభించారు. ఒకవైపు అఖిలపక్షంలోనూ అందరూ ఒకటే నినాదాన్ని వినిపించారు. ప్రజా సంఘాలు ఒక ఐక్య కార్యచరణను రూపొందించి ప్రభుత్వానికి విజ్ఞాపనలు పంపించారు. అధికారపార్టీ నేతలందరూ కలసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఆ సంస్థ వల్ల ఎంతోకొంత ప్రయోజనం జిల్లాకు చేకూరుతోందని వివరించారు. బిజెపి మంత్రి సత్యకుమార్ కూడా తనవంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి ఇప్పటికీ ఎటువంటి స్పందనా కనిపించలేదు. రెన్యువల్‌కు అవసరమైన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. రెన్యువల్ ఆగిపోవడంతో నిధులు వ్యయం చేయకపోవడంతో సంస్థ సాధారణ కార్యకలాపాలకు కూడా ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా వైద్యం అందించే ఆసుపత్రుల్లో సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి కరువు ప్రాంతవాసులకు కల్పతరువుగానున్న ఆర్డీటీకి ఏర్పడిన చిక్కులను తొలగించాలని జిల్లావాసులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

ఈ వారంలో జిల్లాలో ఎండలు, వానలు ప్రభావం చూపాయి. ఒకవైపు ఎండ తీవ్రత పెరుగుతుండగా, మరోవైపు గాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. వేసవిలో నెలకొన్న ఈ వాతవరణంతో జనం అల్లాడిపోతున్నారు. గాలుల దెబ్బకు పంటలు దెబ్బతింటున్నాయి. మామిడి. అరటి, బత్తాయి తదితర పంటలు చేతికొచ్చిన సమయంలో వాతావరణంలోని ఈ మార్పులు రైతులకు తీరని నష్టాని మిగులుస్తున్నాయి. అనూహ్యమైన వాతావరణ మార్పు అందరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

విద్యారంగ సమస్యలపై రేపు ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

విద్యారంగ సమస్యలపై ఈ నెల 5వ తేదీ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ నాయకులు ముత్యాలప్ప, శ్రీనివాసరెడ్డి, బాలరాముడు పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగంలో గత ప్రభుత్వం అవలంబించిన విధానాలనే కొనసాగిస్తూ మరింత గందరగోళ పరిస్థితులు కల్పిస్తుందన్నారు. గత ప్రభుత్వం 6 రకాల పాఠశాలలను నెలకొల్పితే ఈ ప్రభుత్వం 9 రకాల పాఠశాలలు ఏర్పాటు చేసి మరింత గందరగోళం సృష్టిస్తుందన్నారు. ఒక్కో పాఠశాలకు ఒక్కో రకంగా ఉపాధ్యాయులను నియమించడం అభ్యంతరకరమన్నారు. 12వ పీఆర్సీ కమిటీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డిజైన్ విడుదల చేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించా లని, ఇతర ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై ఈ నెల 5వ తేదీ ధర్మవరం తాలూకా కేంద్రం వద్ద ఉదయం 9 గంటలకు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ధర్నాలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం లో రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, ఈశ్వర య్య, బాలయ్య, నరసింహులు, వాసుకుమార్, జగదీష్, రవికుమార్ తదితరులు పిలుపునిచ్చారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

ప్రమాదాలకు నిలయంగా కల్వర్టు గుంతలు

ప్రజాశక్తి-రొద్దం

పెనుకొండ-మడకశిర ప్రధాన రహదారిలో మండలంలోని పెద్దమంతూరు, రొప్పాల గ్రామాల మధ్యలో ఇటీవల కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే అక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయకపోడం పట్ల వాహనదారులు మండిపడుతున్నారు. కల్వర్టు వద్ద వాహనాలు వెళ్లడానికి సింగిల్ లైన్ రోడ్డు వేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు, డ్రైవర్లు పేర్కొం టున్నారు. ఈ రహదారిలో రోజూ వందల సంఖ్యలో పెద్ద పెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుం టాయి. కల్వర్టు నిర్మాణంలో భాగంగా దాదాపు పది అడుగుల లోతు గుంతలు తీసి పనులు చేపడుతు న్నారు. అయితే కల్వర్టు గుంతల వద్ద ఎలాంటి ప్రమాద నివారణకు చర్యలు చేపట్టలేదు. దీనికి తోడు అక్కడ సింగిల్ లైన్ రోడ్డు ఉండడంతో ఎదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కల్వర్టు వద్ద కాంట్రాక్టర్ ప్రమాద నివారణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, అక్కడ మట్టితో రెండు వరుసల రహదారి ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళ వాహనదారులు అప్రమత్తమయ్యేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రమాద హెచ్చరికలు లేకుండా చేపట్టిన కల్వర్టు పనులు



రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని సీసీ గిరి గ్రామంలో శనివారం రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్, సీనియర్ నాయకులు సిద్ధప్ప, మాలేగౌడ్, రైతులు నాగప్ప, సన్నీరప్ప, నాగరాజు, పుట్టన్న, రంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఓబుళదేవరచెరువు : ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తుందని, కావున విద్యార్థులు ఈ నెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ సురేష్ రమణ సూచించారు. విద్యార్థులను లాటరీ విధానంలో ఎంపిక చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఎంఇఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నల్లమాడ : మండలంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ ఎం.నారాయణ తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంఇఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు ఎంజెపి కళాశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక మహాత్మజ్యోతిబాపూలే కళాశాలలో ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపల్ సుందర్‌రాజ్ ఓ ప్రకటన లో తెలిపారు. ఈ కేంద్రంలో మొత్తం 701 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, పెన్ మాత్రమే అనుమతిస్తామన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకూ ఉంటుందని ప్రిన్సిపల్ తెలిపారు.

ఆలయానికి 'బత్తల' విరాళం

ప్రజాశక్తి-కదిరి టౌన్

తనకల్లు మండలంలోని నల్లగుట్ట తండాలో మారెమ్మ గుడికి శనివారం పట్టణంలోని తన నివాసంలో వైసిపి బిసి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ. 10వేలు విరాళం అందజేశారు. ఆలయం గురించి కమిటీ సభ్యులు బత్తల దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన వెంటనే వారికి రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి రూరల్ కన్వీనర్ మణికంఠనాయక్, సర్పంచి లక్ష్మినాయక్, బి.రామంజి, గోబ్రే నాయక్, బాలునాయక్, చిన్నబాలు, లక్ష్మినాయక్ పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న బత్తల హరిప్రసాద్

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

వాల్మీకి, బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరుతూ శనివారం ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి నాగవేణి, జనసేన మండల అధ్యక్షులు మేకల ఈశ్వర్ ఆధ్వర్యంలో ఒడిసిలో ర్యాలీ నిర్వహించారు. అలాగే పోస్ట్ ఆఫీస్ ద్వారా ప్రభుత్వానికి పోస్టుకార్డులు పంపారు. వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చుతామని వాగ్దానాలు చేయడం, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం మామూలైందన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ స్పందించి వాల్మీకి, బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని కోరారు. వాల్మీకి, బోయలను ఎస్‌టి జాబితాలో చేర్చే వరకూ పార్టీలకు అతీతంగా ఉద్యమం ఆపబోమన్నారు. కార్యక్రమంలో బంగారుకృష్ణమూర్తి, మనోహర్, డాక్టర్ కృష్ణమూర్తి, రాజశేఖర్, రామంజి, నాగేష్, ఓబుళప్ప, హరిబాబు పాల్గొన్నారు.


ప్రభుత్వానికి పోస్టుకార్డు పంపుతున్న వాల్మీకి, బోయలు

జనసేన కార్యకర్త ఇంటి మరమ్మతులకు చేయూత

ప్రజాశక్తి-తనకల్లు


వారం రోజుల క్రితం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడం వల్ల మండలంలోని పూలకుంటపల్లి గ్రామంలో జనసేన పార్టీ కార్యకర్త నరేంద్రకు చెందిన సిమెంట్ రేకుల ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈదురుగాలుల ధాటికి ఇంటి పైకప్పు రేకులు విరిగిపోయి ఇంట్లో ఉన్న వస్తువులు పగిలి పోయాయి. ఆ సమయంలో అతని భార్య, పిల్లలు ఇంట్లో లేనందున పెను ప్రమాదం తప్పింది. రోజు వారి కూలి పని చేసుకుని జీవనం సాగించే నరేంద్ర ఇంటి పునర్నిర్మాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కొండా చంద్రమోహన్, చైతు, యోగి, సంకు వెంకటరమణ స్పందించి రేకులు ఇప్పించారు. దీంతో ఇల్లు పూర్తిస్థాయిలో సిద్ధమైంది. అలాగే శనివారం జనసేన పార్టీ కార్యకర్తల ద్వారా బియ్యం, సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొట్టి కుమార్, జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ అమర్ కార్తికేయ, మండల కార్యదర్శులు కాలేషా, నవీన్, అర్షద్, రూపేంద్ర, సతీష్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


జనసేన కార్యకర్తకు సరుకులు అందజేస్తున్న నాయకులు

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పారా లీగల్ వాలంటీర్లు సూచించారు. శనివారం పట్టణంలోని త్యాగ రాజు నగర్‌లో కార్మిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. పిఎల్‌విలు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగ సంస్థలు, కార్మిక సంఘాలు, ప్రభుత్వం మధ్య సంబంధాలను నియంత్రించే చట్టాలుగా పేర్కొన్నారు. చట్టాలు హక్కులు కార్మికులకు రక్షణగా నిలుస్తాయన్నారు. కనీస వేతనం, పని గంటలు, సెలవులు, సమాన వేతనం, పని ప్రదేశంలో భద్రతలను తెలియజేస్తాయన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ పిఎల్‌విలు కె.మాళప్ప, గోపాలకష్ణ, శశి కుమార్, చంద్రకాంత్, కార్మికులు పాల్గొన్నారు.


కార్మిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పారా లీగల్ వాలంటీర్లు

జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో పలువురికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు కళాశాలలో జాబ్ మేళా నిర్వహించి హాజరైన అభ్యర్థులకు వివిధ అంశాలపై ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇంటర్వ్యూలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 14 మందిని ఉద్యోగాల కోసం ఎంపిక చేసినట్లు ప్లేస్ మెంట్ అధికారి బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు తదితరులు అభినందించారు.

చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో ఎదుగుదల మెరుగుపడేలా అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు శ్రద్ధ పెట్టాలని సిడిపిఒ సరస్వతి సూచించారు. కోడేకండ్ల సెక్టార్‌లోని గంటాపురం గ్రామంలో శనివారం సూపర్‌వైజర్ చంద్రమ్మ అధ్యక్షతన పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారుల 1000 రోజుల సంరక్షణ, గర్భం దాల్చినప్పటి నుంచి పిల్లలకు రెండేళ్లు వచ్చేంత వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ కాన్పు సమయంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలింతల బాధ్యత గురించి వివరించారు. అనంతరం ఆర్‌డిటి కమ్యూనిటీ హాలులో గర్భిణులకు సీమంతం, 6 నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని జొన్నల కొత్తపల్లి తండా గ్రామంలో శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు పోషణ పక్వాడా, చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, పోషకా హారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్, సిడిపిఒ ఎస్.సరస్వతి, సూపర్వైజర్ లలితమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్నపిల్లల వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి : స్థానిక ఎంపిపి పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ధర్మవరం పట్టణంలోని అనిల్ చిన్నపిల్లల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుబ్రహ్మణ్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున చిన్న పిల్లలకు ఏవైనా సమస్యలు ఉంటే ఈ ఉచిత వైద్య శిబిరంలో చికిత్స పొందాలని ఆయన సూచించారు.

రాగి పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని రైతుల నుంచి సివిల్ సప్లై అధికారులు, కొండూరు కోఆపరేటివ్ శాఖ వారు రాగుల కొనుగోలు చేస్తారని మండల వ్యవసాయ అధికారి శ్రీలత తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మేరకు క్వింటా రాగులు రూ. 4,290 చొప్పున కొనుగోలు చేస్తారన్నారు. ఇప్పటి వరకూ మండలంలో 26 మంది రైతుల నుంచి 416.5 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. అలాగే రబీ 2024-25 సీజన్‌లో రాగి పంట సాగు చేసిన రైతులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులు కూడా సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

జిల్లా చర్మకార సేవా సంఘం ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా చర్మకార సేవా సంఘం ప్రధాన కార్యదర్శిగా హిందూపురం పట్టణానికి చెందిన వి.అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజా రావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతంలో చర్మకారులు పడుతున్న ఇబ్బందులు గురించి తెలుసుకుని, ఆయా సమస్యలు పరిష్కరించడానికి ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తామన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చొరవతో కదిరి రూరల్ మండలం లోని కుమ్మరవాండ్లపల్లిలో నీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరు చేయించి నూతన బోరు వేయించగా నీరు పుష్కలంగా పడ్డాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాహార్తి తీర్చినందుకు ఎమ్మెల్యే కందికుంట, ఎంపిడిఒ పోలప్పకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.పోలప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ భానుప్రకాష్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ నాయుడు, కూటమి నాయకులు మాజీ సర్పంచి గంగులప్ప, ఎంపిటిసి పుల్లయ్య, ఈశ్వరప్రసాద్, సుధాకర్, శ్రీనివాసులు, భార్గవ్, కదిరప్ప, ధర్మానాయుడు, ఎల్ఐసి శ్రీనివాసులు, ఎస్‌వి.చలపతి, యూనస్, ప్రేమ లత, గంగులప్ప, సుబహాన్, అన్వర్‌బాషా, అంజి, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే చొరవతో బోరు వేయించిన అధికారులు, నాయకులు

ఆర్‌కె రెడ్డికి కన్నడ భాషలో సిఐఐఎల్ పట్టా

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణానికి చెందిన యువ రచయిత పి.రామకృష్ణారెడ్డి మైసూరులోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సిఐఐఎల్) నుంచి లింగ్విస్టిక్ కన్నడ పట్టా పొందినట్లు ఆయన తెలిపారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగు లిట్ చేసిన తాను స్వతహాగా రచయిత అవ్వడం వల్ల ఇతర భాషలపై అధ్యయనం చేయడం వల్ల భాషా పరిజ్ఞానం పెరిగిందన్నారు. తాను కన్నడ భాషాధ్యయనం చేసినందుకు సెంట్రల్ గవర్నమెంట్ నుంచి రూ. 80 వేల స్టైఫండ్ పొందినట్లు తెలిపారు. తమిళం కూడా నేర్చుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కువ భాషలు నేర్చుకుంటే వివిధ రాష్ట్రాల మాండలికాలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలతో పాటు మాతృభాష మీద పట్టురావడమే కాకుండా, భాష మీద మరింత మమకారం ఏర్పడుతుంద న్నారు. భాషాధ్యయనం కోసం ప్రభుత్వమే ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఎవరు ఎన్ని భాషలు నేర్చుకున్నా వారి మాతృభాషలో సంభాషణ జరిపితే మానసిక పరిపక్వత వికసిస్తుందన్నారు. కన్నడ భాషలో పట్టా పొందిన రామకృష్ణారెడ్డిని మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.


కన్నడ బాషలో సిఐఐఎల్ పట్టా పొందిన ఆర్‌కె రెడ్డి


కిశోరి వికాసం పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-హిందూపురం

కిశోర బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యంగా కిశోర వికాస కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మహిళా సంరక్షణ కార్యదర్శి కవిత పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 13వ వార్డు ఎన్టీఆర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక అంశాలపై అవగాహనతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కిశోర బాలికలు రుతు, పరిశుభ్రత పాటించాలన్నారు. లైంగిక వేధింపులకు గురైతే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, లక్ష్మి, మంజుళ, ఖాసింబి, కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

శ్రీసరస్వతి శిశుమందిర్ ప్రారంభానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని 8వ వార్డులో కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల తిరిగి విద్యార్థులతో కళకళలాడే దిశగా అడుగులు వేస్తోంది. ఈ పాఠశాల స్థితిగతుల గురించి తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తక్షణమే స్పందించి పాఠశాల పున్నప్రారంభానికి అవసరమైన చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దీంతో శనివా రం మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు పాఠశాల భవనం మరమ్మతులు, పరిశుభ్రత పనులు, గోడల రంగులు, విద్యుత్, నీరు, టాయిలెట్లు, తదితర సదుపాయాలు, అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ శిశుమందిర్ పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఈ పాఠశాలపై మంత్రి ప్రత్యేక దృష్టి వహించడం వల్లే ఈ పునరుద్ధరణ సాధ్యమవుతోంద న్నారు. త్వరలోనే పిల్లల విద్యకు ఇది కేంద్ర బిందువుగా మారనుందని తెలిపారు.


చైర్మన్ సుదేష్‌బాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

పావగడ మున్సిపల్ చైర్మన్‌గా సుదేష్‌బాబు ఎన్నిక

ప్రజాశక్తి-పావగడ

పావగడ మున్సిపాలిటీ నూతన చైర్మన్‌గా జి.సుదేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో మున్సిపల్ అధ్యక్షుడిగా ఉన్న పిహెచ్.రాజేష్ రాజీనామా చేయడంతో శనివారం మున్సిపల్ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. మున్సిపాలిటీలో మొత్తం 23 మంది సభ్యులు ఉండగా కౌన్సిలర్లు సుజాత, లక్ష్మీదేవి, ఇమ్రాన్ గైర్హాజరు కాగా 20 మంది హాజర య్యారు. కాంగ్రెస్‌పార్టీకి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ సుదేష్‌బాబు ఒక్కరే చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తహశీల్దార్ వరదరాజులు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి సుదేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. సుదేశ్‌బాబు మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. త్వరలోనే ప్రతి వార్డులో సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హెచ్‌వి.వెంకటేష్, మున్సిపల్ చీఫ్ ఆఫీసర్ జాఫర్‌షరీఫ్, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు రాజేష్, ఉపాధ్యక్షురాలు గీతాహనుమంతరాయప్ప, గొర్తి నాగరాజు, వేలురాజు, రవి, కౌన్సిలర్లు, నామినేటెడ్ సభ్యులు, కాంగ్రెస్‌పార్టీనాయకులు పాల్గొన్నారు.

వైసిపిలో పలు విభాగాలకు అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

వైసిపి సంస్థగత పార్టీ పదవులకు పలువురు ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన నియామక పత్రాలను అందజేశారు. నియోజకవర్గ వైద్య విభాగం అధ్యక్షులుగా డాక్టర్ హనుమంతరెడ్డి, కార్మిక విభాగం అధ్యక్షులుగా పూర్ణానంద, మున్సిపల్ విభాగం అధ్యక్షురాలిగా కౌన్సిలర్ సాయిగీత ఎంపికయ్యారు. శ్రీధర్‌రెడ్డి వారిని అభినందించి మాట్లాడారు. ఆయా విభాగాల్లో ఎంపికైన నాయకులు పార్టీ అభివృద్ధి, బలోపేతానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మరో నాలుగేళ్లు కష్టపడితే మళ్లీ వైసిపిదే అధికారం అని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం శ్రీధర్‌రెడ్డిని ఎంపికైన నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొత్తచెరువు మండల కన్వీనర్ శ్యామ్ సుందర్ రెడ్డి, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డే నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు వాల్మీకి శంకర్, మాజీ సర్పంచి రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో డ్రోన్ నిఘా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో నిర్మానుష్య ప్రదేశాల్లో పోలీసులు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టారు. బహిరం గంగా మద్యం తాగడం, గ్యాంబ్లింగ్, అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ, చట్ట వ్యతిరేక కార్యకలా పాలు, గంజాయి వినియోగించే వారిపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టేలా ఎస్పీ వి.రత్న శ్రీకారం చుట్టారు. అటవీ ప్రాంతం, నిర్మానుష్య ప్రాంతాలతో పాటుగా ఆయా పరిసర ప్రదేశాలు, తోట లపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి వినియోగం, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ, ఇతర నేరాలు జరగ కుండా డ్రోన్ కెమెరాలతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

బైక్ బోల్తా.. వ్యక్తి మృతి

గాండ్లపెంట : గాండ్లపెంటకు చెందిన పాములూరి మారుతిప్రసాద్(36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జమేదార్ గంగాధర్ తెలిపిన వివరాలు.. మారుతిప్రసాద్ శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై కదిరి నుంచి స్వగ్రామం వస్తుండగా చిన్నమిట్ట వద్ద గేదె అడ్డం రావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రమైన గాయం కావడంతో వెంటనే 108 వాహనంలో కదిరి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


మారుతిప్రసాద్ (ఫైల్‌ఫొటో)

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్ : పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన గురుస్వామి(37) శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. నాగరాజు కుమా రుడు గురుస్వామి గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న సూపర్ వాస్మోల్ తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గురుస్వామిని వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. అతడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

పెనుకొండ : అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ సృజనబాబు తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. గోరంట్ల మండలం లోని కోరేవాళ్లపల్లి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్నాటక నుంచి వస్తున్న మారుతి-800 వాహనాన్ని ఆపి సోదాలు చేశారు. అందులో 18 మద్యం బాక్సులను గుర్తించారు. అలాగే నల్లమాడ గ్రామానికి చెందిన పురుషోత్తంనాయక్, నాగరాజులను అరెస్టు చేసి కారు, 1,728 కర్నాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. దాడుల్లో ఈఎస్‌టిఎఫ్ ఎస్ఐ పిఓ ఓం సింహా, కానిస్టేబుల్స్ డి.మల్లికార్జున, దేవేంద్రనాయక్, భరత్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.